ఒక గురువుగారు తన శిష్యుణ్ణి వెంటబెట్టుకుని ఊరూరూ తిరుగుతున్నారు. ఎక్కడ ఆశ్రమం నెలకొల్పుకుందామా అని అన్వేషిస్తూ.

అలా మరో ఊరు చేరుకున్నారు.

''రేపు తెల్లవారుఝామున ఒక శక్తి ప్రతి ఇంటి ముంగిటకు వస్తుందని... ఏ వీధి గుమ్మానికి పసుపు, కుంకుమ బొట్టు వుండదో ఆ ఇంటికి హాని కలుగ జేస్తుందని విస్తృతంగా ప్రచారం చేసిరా'' అని గురువుగారు శిష్యుడికి చెప్పారు.

''ప్రతి ఊళ్ళోను మీరిలాగే చెప్పి రమ్మంటున్నారు... ఎందుకండి నన్నిన పరంగా హైరానా పెడ్తారు?'' అన్నాడు విసుగెత్తిపోయిన శిష్యుడు.

''మారు మాట్లాడక... ముందు నేను చెప్పినట్టు చేసిరా'' అని ఆగ్రహంగా అన్నారు గురువుగారు.

చేసేదిలేక తలదించుకుని గురువుగారు చెప్పినట్లుగా ప్రచారం చెయ్యడానికి వెళ్ళిపోయాడు శిష్యుడు.

ఆ మర్నాడు తెల్లవారుఝామున




గురువుగారు శిష్యుణ్ణి ''ఊళ్ళోకి వెళ్ళి అన్ని గుమ్మాలు చూసిరా'' అని చెప్పారు.

''చూడ్డానికేముంటుంది! అన్ని ఊళ్ళల్లోను ఉన్నట్లే ఏవో కొన్ని గుమ్మాలకు పసుపు, కుంకుం బొట్లు — మిగతా గుమ్మాలకు ఏ బొట్టూ లేకుండానూ వుంటుంది. ఈ మాత్రం దానికి నా కాళ్ళరిగేలా తిప్పడమెందుకు చెప్పండి'' అన్నాడు శిష్యుడు.

''చెప్పిన పని చెయ్యకుండా ఎదురు జవాబులు చెప్పడం ఎక్కువైపోతోంది — ఇలా అయితే నిన్నేం చేస్తానో చూడు'' అని శిష్యుని పీక పుచ్చుకున్నారు.

''గురూగారు — గురూగారు — వన్నొదలండి — మీరు చెప్పినట్లే చేసొస్తా'' అని ప్రాధేయపడ్డాడు శిష్యుడు.

శిష్యుడు వీధి వీధి కాళ్ళరిగేలా తిరిగాడు.

ప్రతి వీధి గుమ్మానికీ పసుపు, కుంకుమ బొట్టూ వుండడం చూసి దిగ్భ్రాంతి చెందాడు.

నడవలేక నడుస్తూ రొప్పుకుంటూ వచ్చి ''గురూగారు! మహాశ్చర్యకరమైన విషయం! పసుపు, కుంకుమ బొట్టూ లేని వీధి గుమ్మం ఒక్కటి కూడా లేదంటే నమ్మండి'' అన్నాడు.

గురువుగారు పొంగిపోయారు.

''అయితే మనం ఈ ఊళ్ళోనే ఆశ్రమం ఏర్పాటు చేసుకుందాం'' అన్నారు మహదానందంగా.

శిష్యుడు తెల్లబోయాడు.

''పసుపు, కుంకుమ బొట్లకి, మనం ఆశ్రమం నిర్మించుకోడానికి సంబంధం ఏమిటండీ?'' అని అడిగాడు శిష్యుడు తికమకపడుతూ.

''ఉంది — ఈ ఊరి వారందరికీ మూఢ నమ్మకాలు గాఢంగా వున్నాయని, వీరంతా చాలా పిరికి వాళ్ళని రూఢీ అయిపోయింది... ఇంతకంటె మనకు అనువైన ఊరు మరొకటి దొరకదు. మన ఆటలు సాగాలంటే మనం ఇక్కడే తిష్ట వేయాలి'' అన్నారు గురువుగారు.

''అదా విషయం! గురూగారు ప్రజల నాడి భలే కనిపెట్టారే! హ్హ హ్హ హ్హ'' అని నవ్వుకున్నాడు శిష్యుడు వంకర్లు పోతూ. ●

